వారణాసి రామకృష్ణ

# చూడాలని లేదు

టీవీలో 'సిన్మారౌండప్' ప్రోగ్రాం చూస్తుండగా సడెన్‌గా మా 'బావ' అనగా బాలవర్ధనం కనిపించాడు. అమెరికాలో సుబ్బరంగా ఉజ్జోగం చేసుకునేవాడు. ఆ మధ్య నాకోసారి ఫోన్ చేసి ''బాసూ! (అనగా బాలసుబ్రహ్మణ్యం) ఓ గొప్ప తెలుగు సిన్మా తీద్దామని ఉందిరా! నీ ఉద్దేశ్యమేంటి? కథ కూడా నువ్వే రాయాలి!'' అనేసరికి ''బావా! ఆ పని మాత్రం చెయ్యకు!'' అంటూ తెలుగు చలనచిత్రాతి చిత్ర వివరాలు. పరిస్థితులు ఏకరువుపెట్టి, చిలక్కి చెప్పినట్టు వద్దని చెప్పాను.

అయినా బావ సిన్మా తీస్తున్నాడన్న సంగతి తెలీగానే [illegible] ఫోన్ చేశాను. వెంటనే లైన్ దొరికింది. [illegible] రమ్మనగానే షూటింగ్ స్పాట్‌కెళ్లాను.

అక్కడెవరో వ్యక్తి అందర్నీ కంట్రోల్ చేస్తున్నాడు. ఎవరాని ఆరాతీస్తే- ఆయనే సిన్మాల ఫైనాన్షియర్‌ట!

''బావా! సిన్మా పేరేంట్రా'' అని అడిగేలోపతే ఫైనా దూసుకొచ్చి-

''పేరు అడక్కండి సార్!'' అన్నాడు. అమ్మో! ఇంత సీక్రెట్గా అనుకునే లోపలే అతగాడు-

''పేరు మీకు చెప్పామనుకోండి... ఈలోగానే దాన్ని అందరూ కాపీకొట్టేస్తారు'' అన్నాడు అటు ఇటు భయంగా పరికిస్తూ!

''పోనీ సీక్రెట్‌గా ఓ మూల కూచుందాం'' అంటూ బావ లేచాడు. అందరం రహస్యంగా ఏదో కుట్ర పన్నుతున్నవాళ్లలా ఓ చోట చేరాం!

''కాస్త కతేంటో చెప్తె మా బాసుగాడితోపాటు నేనూ వింటాను! చెప్తారా కవి గారూ!'' అని మా బావ బెరుగ్గా అడగ్గానే కవి గారనబడే జీన్స్‌ప్యాంటు, నల్ల రేబాన్ కళ్ళద్దాల శాల్తీ 'వో- యా' అంటూ చెప్పసాగాడు.

కాలేజీలో చదివే హీరో తన గాళ్ ఫ్రెండ్ని ప్రేమిస్తాడు. కానీ ఆ విషయం పైకి చెప్పలేడు. అలాగే ఆమె కూడా అతన్ని ప్రేమిస్తూనే వుంటుంది కానీ అతనితో చెప్పలేకపోతుంది. వీళ్లిద్దరూ ఇలా ఒకర్నొకరు మూగగా ప్రేమించుకుంటుండగానే ఆమె నెల తప్పుతుంది! ఈలోగా వాళ్ళ డాడీ ఆమెకి పెళ్ళి చేస్తాడు. ఆమె అటు మొగుడ్ని ప్రేమించలేక ఇటు లవర్ని లవ్ చేస్తున్నానని చెప్పలేక మానసిక సంఘర్షణకి లోనవుతుంది. ఇరవై ఏళ్లు గడుస్తాయి. అయినా ఆమెకు చెప్పే ధైర్యం రాదు. ఆమెకి పుట్టిన కూతురు కాలేజీలో తనతోపాటు చదివే కుర్రాడ్ని లవ్ చేసి ఇద్దరూ పెళ్లి చేస్కోవాలని డిసైడ్ చేసుకుని ఆమె దగ్గరికొస్తారు. అచ్చు తన ప్రియుడిలానే వున్న కుర్రాడ్ని చూసి ఆమె మూర్ఛపోయి, తేరుకుని ఆ కుర్రాడి తండ్రి గురించి తెలుసుకోగా- అతను తను ప్రేమించిన మనిషే!

అసలు విషయం తెలుసుకున్న ఈ తరం పిల్లలిద్దరూ సంతోషిస్తారు. 'అన్నయ్యా... చెల్లెమ్మా' అని ఒకర్నొకరు గాఢంగా కౌగిలించుకుంటారు. తర్వాత కర్తవ్యం గుర్తెరిగి కుర్రాడు తండ్రిని, కుర్రది తల్లిని పార్కుకి తీసుకొచ్చి 'ఇకనైనా ఇద్దరూ ప్రేమించుకున్న విషయం' చెప్పుకోమంటారు! తమ పిల్లలు ఇద్దర్నీ కలపటం చూసి సంతోషంగా ఏడుస్తూ ఇద్దరూ ప్రేమించుకుంటున్న సంగతి ఒకరికొకరు చెప్పుకుంటారు!



-అనర్గళంగా కవి గారు చెప్పి సిగిరెట్ వెలిగించుకుని మళ్లీ ''ఈ సిన్మాలో వున్న గొప్ప పాయింటేమిటంటే...'' పూర్తి చేసేలోగానే ఫైనా అతనిమీదపడి నోరు నొక్కేసి ''వొద్దొద్దు! చెప్పకు! పాయింటుని ఎవరైనా కాపీ కొట్టేస్తారు'' భయంగా అన్నాడు.

''సిన్మాకి 'ప్రేమించుకోండి... తొందరగా!!' అన్న పేరైతే బాగా సూటవుతుంది బావా!'' అన్నాన్నేను కచ్చగా నాలోనేనే బూతులు తిట్టుకుంటూ!

''చూశారా చూశారా! మనం అనుకున్న పేరే ఇతగాడూ చెప్పేశాడు! అందుకే నేను ఎవ్వర్నీ నోరెత్తదనేది!'' అంటూ ఫైనా గట్టిగా కేకలు వేశాడు.

మా బావ ''సరే సరే! ఇంతకీ మ్యూజిక్ డైరెక్టర్ని ఎవర్ని సెలెక్ట్ చేద్దాం?'' రహస్యంగా అడిగాడు.

''ఎవర్నో ఏంటి? మొన్న టామిల్ పిచ్చర్‌లో అదరగొట్టిన శరగోపన్ గారినే ఫిక్స్ చేద్దాం!'' ఫైనా అన్నాడు.

''తెలుగు సిన్మాకి టామిల్ డైరక్టరా?'' మా బావ నోరు తెరిచాడు.

''ఆయన టామిలియన్ కాదయ్యా... మలయాళీ! అయినా పిచ్చర్కి బయ్యర్లు రావాలంటే మంచి పేరున్న వాడ్ని సెలెక్ట్ చెయ్యాలి!'' ఫైనా చిరాగ్గా అన్నాడు. వెంటనే కవిగారు -

''అవునవును! మొన్న నేను ఫారినెళ్లినపుడు రాసిన 'వాస్కోడిగామా' పాటకి ఆయన వెంటనే సూపర్ ట్యూనింగ్ చేశారు!'' అన్నాడు ఫైనా కవిగారి చెవిలో నోరుపెట్టి.

''గట్టిగా అనబాక! పాట నెవరైనా కాపీ కొడ్తారు! ఇంతకీ ఆ పాట కాస్త మెల్లగా హమ్మింగ్ చేసుకో!'' అనేసరికి ''వాస్కోడిగామా - వాస్కోడిగామా- చూస్కోర మామా కాసింత ప్రేమ!'' అని రాగం తీశాడు. అది విని మా బావ విలవిలలాడుతూ -

''ఇదేం తెలుగుపాట? చక్కగా తెలుగు చక్కెర పలుకులు వుట్టిపడేలా మంచి పాట రాయండి కవిగారూ'' అన్నాడు.

దానికి కవిగారు నల్లకళ్లజోడు తీసి నవ్వేస్తూ-

''ఇప్పుడు తెలుగు పాటలో ఒక్క ముక్క తెలుగు వుండకూడదండీ బాబూ! ఇప్పుడు చరణం వినండి'' అంటూ- ''మింటను విస్కీ పీకే రేపు చెయ్యలేదా- క్లింటను లూయిన్స్కీని ట్రాపు చెయ్యలేదా- స్టాలిన్‌కీ హైర్లే బాబా లవ్వు స్టోరీలు-'' రాగం తీసి మధ్య మధ్యలో ''హై హై హాయ్'' అంటూ పశువుల్ని తోలినట్టు శబ్దం చేశాడు.

మాబావ రియాక్షన్ నవ్వో ఏడుపో నాకర్థం కాలేదు కానీ నేను మాత్రం తేరుకుని ''కవిగారూ! పాట మధ్యలో పశువుల్ని తోలినట్టు ఆ హై హైలెందుకు?'' అమాయకంగా అడిగాను.

కవిగారు మళ్లీ నవ్వేసి ''చమక్కు పట్టేశారు! చూడండీ- సిన్మా హాల్లో పాట ప్రారంభం కాగానే కొందరు ప్రేక్షకులు సీట్లోంచి లేచి సిగిరెట్ కాల్చుకుందామని బైటికి వెళ్తున్నారట! దీనిమూలాన అభిమాన ప్రేక్షకులకి ఇబ్బంది కలుగుతోందని మాకు రిపోర్టులొచ్చాయి. దాంతో అలా లేచి వెళ్లేవాళ్ళని అదిలించి సీట్లో కూర్చోబెట్టె గొప్ప ప్రక్రియే ఈ హైహైలు!'' చెప్పగానే ఫైనా అందుకుని ''జాగర్త! జాగర్త! ఈ ప్రయోగాన్ని ఎవరైనా కాపీ కొట్టేస్తారేమో!'' భయంగా అన్నాడు.

నేను ఫైనాని అనుమానంగా చూస్తూ- ''బావా! మీ సిన్మాలో హీరోయిన్ ఎవర్రా?'' మెల్లగా అడగ్గానే 'ఫైనా నవ్వేసి -

''ఇందులో సీక్రేటేం లేదులెండి! మోన్కీ జింగ్యానీ, మున్నీ ఓంతాలస్.... అని ఇద్దరు ఆర్టిస్టులు!'' అన్నాడు చొంగ కార్చేస్తూ!

ఆ పేర్లు వింటుంటే అవేవో డ్రగ్ ఫార్ములేషన్స్ పేర్లలా వుంది కానీ హీరోయిన్ పేర్లలా లేవు. వాళ్ళంతా పంజాబీ, కాశ్మీరీ అమ్మాయిలట! మా బావ మళ్లీ గింజుకుంటూ-

''ఫైనాగారూ! కనీసం హీరోయిన్‌నైనా చక్కగా పదహారణాల తెలుగమ్మాయిని...'' దీనంగా చెప్పేలోగానే ఫైనా కోపంగా చూసి-

''ఛుప్! అప్పుడు మనకు పదహారణాలు కూడా మిగలవు! చిప్ప పట్టుకుని అడుక్కోవాల్సిందే!'' అనేసి కోపంగా నా వంకచూసి-

''ఏంటిసార్! టెలుగూ సిన్మా తియ్యటం అంటే అంతా తెలుగువాళ్ళతో, తెలుగు డైలాగుల్తో, తెలుగుదనం వుండే సిన్మాలనే అనుకుంటున్నారా?''



''ఇప్పడు తెలుగు పాటలో ఒక్క ముక్క తెలుగు వుండకూడదండీ బాబూ! ఇప్పడు చరణం వినండి'' అంటూ- ''మింటను విస్కీ పీకే రేపు చెయ్యలేదా- క్లింటను లూయిన్స్కీని ట్రాపు చెయ్యలేదా- స్టాలిన్‌కీ హైర్లేబాబా లవ్వు స్టోరీలు-'' రాగం తీసి మధ్య మధ్యలో ''హై హై హాయ్'' అంటూ పశువుల్ని తోలినట్టు శబ్దం చేశాడు.

తీవ్రంగా ప్రశ్నించాడు. నేను బావ వంక చూస్తే అతని నోరు రౌండుగా వోపన్ అయి వుంది. నేను నీళ్ళు నములుతూ బైటికి తప్పుకున్నాను.

వారంరోజులు గడిచాయి. ఓరోజు బావ నీరసంగా మా ఇంటికొచ్చి ''బాసూ! గోరం! గోరం జరిగిం. దిరా'' అన్నాడు.

''ఏమైందిరా?'' కంగారుగా అడిగాను.

''ఆ కవిగాడు, ఫైనా ఇద్దరూ కలిసి నా సిన్మా కతని మరొకరికి అమ్మేశార్ట! అదే సిన్మాని ఇప్పుడు మరో బ్యానర్‌లో తీస్తున్నారని తెలిసింది!'' బావురుమన్నాడు.

''ఇంత మంచి వార్తకి నవ్వకుండా ఏడుస్తావేంట్రా!''

''అదేంట్రా బాసూ! అలా అంటావు? ఇప్పుడేం చెయ్యాలి నేను?''

''సుబ్బరంగా అమెరికాకి కాకిలా ఎగిరిపోయి నీ వుజ్జోగం నువ్వు చేసుకోరా!'' చెప్పాను నేను!

ఇది జరిగి చాలా రోజులవుతోంది. అయితే బావ ఆధ్వర్యంలో ఆరంభమయి చిత్రాతి చిత్ర మలుపులు తిరిగిన ఆ చిత్ర రాజం ఆ తర్వాత ఎప్పుడు రిలీజయిందో... ఎటుపోయిందో నాకేమీ తెలీదు.

పాత తెలుగు సినిమాలమీద పరిశోధన చేస్తూ ఈ మధ్య పూనా ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ కెళ్తె- ఈ సిన్మా తాలూకు రీళ్లు కొన్ని వేసి స్టూడెంట్స్‌కి చూపిస్తున్నారు!

ఆశ్చర్యంగా నేనూ చూసి 'ఇది ఇంత గొప్ప చిత్రరాజమా?' అనుకునే లోపలే- శిక్షణా సంస్థ అధికారి ''ఇప్పుడు మీరు తెలుగు సిన్మాని ఎలా తియ్యకూడదో తెలుసుకునే రీళ్ళు చూశారు!'' అన్నాడు. దాంతో మనస్ఫూర్తిగా నవ్వేశాను!!

★

